సాక్షి సంగారెడ్డి

శనివారం । 11 । ఫిబ్రవరి । 2023



హత్యకేసులో నిందితుడి అరెస్ట్

జహీరాబాద్ సమీపంలో గురువారం జరిగిన మహిళ హత్య కేసును పోలీసులు ఛేదించారు. బీదర్ పారిపోతుండగా నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. 8లో



అడ్డుకట్ట వేద్దాం

బహిరంగ మలమూత్ర విసర్జనకు అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. 9లో

శుభకార్యాలకు ఆర్టీసీ బంపర్ ఆఫర్

సంగారెడ్డి టౌన్: పెళ్లిళ్లకు, శుభకార్యాలకు ఆర్టీసీ బస్సులను అద్దెకు తీసుకునే వారికి ప్రత్యేకంగా 10 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు ఆర్టీసీ మెదక్ రీజినల్ మేనేజర్ సుదర్శన్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ రాయితీ జూన్ 30వ తేదీ వరకు అమలులో ఉంటుందని తెలిపారు. www.tsrtconline.in లో అద్దె బస్సులను బుక్ చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

న్యూస్‌రీల్

కనుల పండువగా శివలింగ ప్రతిష్ఠ



ప్రత్యేక పూజలు చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ

కంది(సంగారెడ్డి): మండల పరిధిలోని చెర్లగూడెంలో శివలింగ ప్రతిష్ఠ మహోత్సవం కనుల పండువగా జరిగింది. మూడు రోజులుగా కొనసాగుతున్న మహోత్సవంలో భాగంగా శుక్రవారం యంత్ర ప్రతిష్ఠాపన, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, నవగ్రహ ప్రతిష్ఠాపన, బలిహరణ, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ, కార్పొరేటర్ పుష్ప నగేశ్, ఎంపీపీ సరళాపుల్లారెడ్డి, జెడ్పీటీసీ కొండల్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సత్యనారాయణగౌడ్, ఉపసర్పంచ్ మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

పప్పు దినుసుల ప్రాధాన్యంపై అవగాహన



శనగ పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

జహీరాబాద్: మండలంలోని రంజోల్ గ్రామంలో వ్యవసాయ శాఖ, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు పప్పుదినుసుల ప్రాధాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో సాగులో ఉన్న శనగ పంటతో పాటు జొన్న, కుసుమ క్షేత్రాలను సందర్శించారు. యాసంగిలో భాగంగా బెంగుళూరులోని భారతీయ ఉద్యాన పరిశోధన కేంద్రం వారి ఆర్కాషామ పుచ్చకాయ, ఆర్కా రెడ్ టమాటా నారును రైతులకు అందించారు. దిగుబడులను బట్టి వచ్చే సీజన్‌లో మిగతా రైతులకు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త సరిత, జీవ ఎరువుల ల్యాబ్ అధికారి ప్రేమలత, ఏఈఓ ప్రదీప్ కుమార్, రైతులు మాణిక్‌రెడ్డి, పెంటారెడ్డి, పండరి, ఫిరోజ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముగిసిన ప్రతిష్ఠ మహోత్సవం

బగలాముఖి అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

శివ్వంపేట(నర్సాపూర్): బగలాముఖి దేవతా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం శుక్రవారం ముగిసింది. చివరి రోజు వేద పండితులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ముగింపు మహోత్సవంలో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం దామోదర రాజనర్సింహ, జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత శేఖర్‌గౌడ్, ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ట్రస్ట్ సభ్యులు భక్తులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకున్నారు.

కొత్తగా మత్స్యకారుల సొసైటీలు, సభ్యత్వ నమోదు

- చెరువుల విస్తీర్ణం ఆధారంగా కొత్తవారికి అవకాశం
- ఈ నెల 15లోగా ప్రక్రియ పూర్తికి కసరత్తు

నూతనోత్సాహం!



సదాశివపేట ఊబ చెరువులో చేపపిల్లలను వదులుతున్న ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, మత్స్యకారులు(ఫైల్)

సదాశివపేట(సంగారెడ్డి): రాష్ట్ర ఏర్పాటు తర్వాత మిషన్ కాకతీయ పథకం కింద చెరువుల అభివృద్ధి, మత్స్యకారులకు ప్రోత్సాహకాలు, రుణాల పంపిణీతో పాటు మత్స్య సంపదను పెంచేందుకు వంద శాతం సబ్సిడీతో ఉచితంగా చేపపిల్లలను ప్రభుత్వం సరఫరా చేసి జీవనోపాధి కల్పిస్తోంది. జిల్లాలో మత్స్యకార సొసైటీల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి నూతన సభ్యత్వాలు పెంచాలని జనవరి 31న కలెక్టర్ మత్స్యశాఖ జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. నియమ నిబంధనల మేరకు నూతన సభ్యత్వాలు ఇవ్వాలని సూచించారు. ఈ ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

51 శాశ్వత నీటి వనరులు

- జిల్లాలోని సింగూరు, నల్లవాగు ప్రాజెక్టులతో పాటు 51 శాశ్వత నీటి వనరులు, 1,018 చెరువులు, కుంటల్లో చేప పిల్లలను వదలడంతో మత్స్యకారులకు ఆదాయం సమకూరుతోంది. చెరువుల విస్తీర్ణం ఆధారంగా మత్స్య సొసైటీలను పెంచాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించడంతో నూతన సభ్యత్వాలు ఇచ్చేందుకు జిల్లా మత్స్యశాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు.
- ఫిబ్రవరి చివరి వరకు నూతన సభ్యత్వాలు నమోదు చేయాలని, 18 నుంచి 65 సంవత్సరాల మధ్య వయస్సు గల వారికి మత్స్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే పరీక్షలకు హాజరై సభ్యత్వాన్ని నమోదు చేయించుకోవాలని సూచిస్తున్నారు. అయితే చెరువులు నిండుగా ఉండటం, మత్స్య సంపద పెరగడంతో సభ్యత్వాల నమోదు విషయంలో మత్స్య శాఖ అధికారులు, మత్స్యకారుల మధ్య పంచాయతీలు కూడా పెరుగుతున్నాయి.

206 మత్స్య సహకార సంఘాలు

- చెరువుల విస్తీర్ణం ఆధారంగా సభ్యుల సంఖ్య ఉండాలని రాష్ట్ర మత్స్య శాఖ ఉన్నతాధికారులు జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లాలో రెండు ప్రాజెక్టులు సింగూరు, నల్లవాగుతో పాటు 51 శాశ్వత నీటి వనరులు, 1,018 చెరువులు, కుంటలు ఉన్నాయి. జిల్లాలో మొత్తం 206 మత్స్య సహకార సంఘాలు ఉండగా 10,485 సభ్యులు ఉన్నారు.
- నీటి వనరుల విస్తీర్ణాన్ని బట్టి 206 మత్స్య సహకార సంఘాల్లోని 152 సొసైటీల్లో 4,937 మందిని కొత్త సభ్యులుగా చేర్చుకోనున్నారు. అలాగే 321 మంది నూతన సభ్యులతో 14 సంఘాలను కూడా ఏర్పాటు చేయనున్నారు. దీంతో కొత్త సభ్యుల సంఖ్య 5,258కి చేరుకొనే అవకాశాలు కనిపిస్తున్నాయి.
- ప్రజా ప్రతినిధులు, అధికారుల సమన్వయంతో కొత్త సభ్యులను గుర్తించి వృత్తి నైపుణ్య శిక్షణ ఇస్తారు. వారికి పరీక్ష నిర్వహిస్తారు. అనంతరం సభ్యులుగా చేర్చుకుంటారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిరంతర నీటి లభ్యత ఉన్న చెరువుల విస్తీర్ణం ఆధారంగా ఎకరం విస్తీర్ణానికి ఒక సభ్యుడి చొప్పున, ఇతర చెరువులు, కుంటలకు రెండు ఎకరాల విస్తీర్ణానికి ఒక సభ్యుడి చొప్పున సభ్యులు ఉండాలి.

చెరువులు, సభ్యత్వాల పంచాయతీ

ప్రభుత్వం ప్రతి చెరువులో వంద శాతం సిబ్సిడీతో ఉచితంగా చేప పిల్లలను సరఫరా చేస్తోంది. దీంతో మత్స్యకారులకు చేపల అమ్మకం ద్వారా ఆదాయం వస్తోంది. ఇలా వచ్చే ఆదాయంపై అందరి దృష్టి పడింది. ఇప్పటివరకు ఒక చెరువుపై రెండు మూడు గ్రామాల మత్స్యకారులకు హక్కులు ఉండేవి. సభ్యుల సంఖ్య తక్కువగా ఉండేది. ఆ చెరువుల నుంచి వచ్చే ఆదాయాన్ని అందరూ పంచుకునేవారు. ఇప్పుడు పెరిగిన ఆదాయం.. కొత్త సభ్యత్వాల నమోదు కార్యక్రమంతో చెరువుల వద్ద సభ్యత్వాల పంచాయతీ ఎక్కువైంది. అలాగే చెరువుల బహిరంగ వేలంతో వస్తున్న ఆదాయం పంపకాల్లోనూ పోటీ ఎక్కువైంది. దీంతో నూతన సభ్యత్వాల నమోదుకు డిమాండ్ పెరిగింది.

ప్రభుత్వ నిబంధనల మేరకే..

జిల్లాలోని శాశ్వత నీటి వనరులు, చెరువులు, కుంటల విస్తీర్ణం ఆధారంగా ప్రభుత్వ నిబంధనల మేరకు సభ్యత్వాలు ఇచ్చి చెరువులను కేటాయిస్తాం. నూతన సంఘాల ఏర్పాటు, సభ్యత్వాలు, చెరువుల కేటాయింపు మొదలైన అంశాలపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. చెరువుల విస్తీర్ణం, చెరువులు ఉన్న ప్రాంతాలు, వృత్తి నైపుణ్య శిక్షణ మొదలైన అంశాలను పరిగణలోకి తీసుకుంటాం. ఈ విషయమై మత్స్య సహకార సొసైటీలు త్వరగా తీర్మానాలు పంపించాలి.

– సతీశ్, జిల్లా మత్స్య శాఖ అధికారి



జహీరాబాద్ పట్టణం

జహీరాబాద్‌కు మరో మణిహారం

- మహీంద్ర ప్లాంట్‌కు అనుబంధంగా విద్యుత్‌వాహనాల తయారీ కేంద్రం
- రూ.వెయ్యి కోట్లతో ఏర్పాటు కానున్న ప్లాంట్
- యువతకు ఉపాధి అవకాశాలు

జహీరాబాద్: జహీరాబాద్‌లో మహీంద్ర అండ్ మహీంద్ర యాజమాన్యం విద్యుత్ వాహనాల తయారీ(ఈవీ) కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చింది. ఇందు కోసం రూ.వెయ్యి కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు నిర్ణయించింది. ప్రస్తుతం జహీరాబాద్‌లో ఉన్న ప్లాంటుకు అనుబంధంగా నూతన తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు సంసిద్ధతను వ్యక్తం చేసింది. మహీంద్ర యాజమాన్యం రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం(ఎంవోయూ) కుదుర్చుకుంది. లాస్ట్ మైల్ మొబిలిటీ వ్యాపారంలో భాగంగా 3,4 చక్రాల విద్యుత్ వాహనాలను తయారు చేయనుంది. ఈ ప్రాజెక్టును చేపట్టడం వల్ల జహీరాబాద్ ప్రాంతంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. సుమారు వెయ్యి మందికి ఉపాధి లభించే అవకాశం ఉంది. మహీంద్ర యాజమాన్యం ఈ మేరకు ముందుకు రావడంతో జహీరాబాద్ ప్రాంత ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం జహీరాబాద్ ప్లాంట్‌లో మహీంద్ర మినీ ట్రక్కుల తయారీ, ట్రాక్టర్ ఉత్పత్తులను చేస్తోంది. ఇప్పటికే ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు మూడు వేల మందికి ఉపాధి లభిస్తోంది. తాజా ప్లాంట్ రావడం వల్ల మరింత ఉపాధి అవకాశాలు పెరిగేందుకు అవకాశం కలిగింది.

ఇంటర్‌లో మంచి ఫలితాలు సాధించాలి

ఇంటర్మీడియట్ బోర్డు జిల్లా అధికారి గోవిందరాం



మాట్లాడుతున్న గోవిందరాం

జోగిపేట(అందోల్): ఇంటర్మీడియట్ పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులు బాగా చదివి పరీక్షల్లో మంచి మార్కులు సాధించి, తల్లిదండ్రులకు, అధ్యాపకులకు మంచి పేరు తీసుకురావాలని ఇంటర్మీడియట్ బోర్డు జిల్లా అధికారి గోవిందరాం అన్నారు. శుక్రవారం జోగిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ప్రభుత్వం విద్యార్థుల కోసం అనేక నిధులు విడుదల చేస్తుందని, మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వ కళాశాలలో చదివే విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కొమ్ము రజిత, విశ్రాంత అధ్యాపకురాలు షమీం సుల్తానా, బాలికల కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశం, అధ్యాపకులు, సుజాత, శ్రవణ్ కుమార్, గోవర్ధన్ రెడ్డి, విఠల్, శ్రీనివాస్, మల్లేశం, అనిత, ప్రసన్నలక్ష్మి, నాగరాజు, రషీద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీకాంత్ గౌడ్

రాష్ట్రంలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే..

ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడీల శ్రీకాంత్ గౌడ్

పటాన్‌చెరు టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా గోస, బీజేపీ భరోసా కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడీల శ్రీకాంత్ గౌడ్ అన్నారు. శుక్రవారం బీజేపీ పటాన్‌చెరు మండల శక్తి కేంద్ర ఇన్‌చార్జి నారాయణదాసు ఆధ్వర్యంలో ఇస్నాపూర్ గ్రామంలో ప్రజా గోసా బీజేపీ భరోసా పేరిట స్ట్రీట్ కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్టీ నేత అశ్వద్ధామ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నరె రెడ్డి, స్ట్రీట్ కార్నర్ మీటింగ్ కోఆర్డినేటర్, ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడీల శ్రీకాంత్ గౌడ్, కోఆర్డినేటర్లు గోదావరి అంజిరెడ్డి ఎడ్ల రమేశ్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అశ్వద్ధామ రెడ్డి మాట్లాడుతూ.. ఈ నెల 25వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా 11 వేల శక్తి కేంద్రాల్లో స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లు నిర్వహిస్తున్నరని తెలిపారు. అనంతరం స్ట్రీట్ కార్నర్ మీటింగ్ కోఆర్డినేటర్ గడీల శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ అక్రమాలను ప్రజల్లో తీసుకెళ్లి ప్రజల కష్టాలను తెలుసుకుంటూ భవిష్యత్‌పై భరోసా కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి బైండ్ల కుమార్, నాయకులు దేవేందర్ గౌడ్, రాజశేఖర్ రెడ్డి, శ్రీనివాస్ గుప్తా, రవీందర్, సహదేవ్, వీరారెడ్డి, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

- సిర్గాపూర్ విద్యార్థిని మృతి ఘటనపై ఆందోళన
- న్యాయం చేయాలని బంధువులు, కుటుంబ సభ్యుల డిమాండ్
- గురుకుల పాఠశాల గేటు ధ్వంసం



ఆందోళన చేస్తున్న వారికి నచ్చజెబుతున్న డీఎస్పీ బాలజీ



రాళ్ల దాడితో ధ్వంసమైన పాఠశాల గేటు

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ ఎస్టీ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థిని మృతిపై బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని, విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలని తల్లిదండ్రులు, బంధువులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. గురుకులంలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న కోహీర్ మండలం పిచర్యాగడి తండాకు చెందిన విద్యార్థిని ఇటీవల పాఠశాల భవనంపై నుంచి పడి గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం విధితమే. న్యాయం చేయాలని కుటుంబీకులు, బంధువులు పాఠశాల వద్దకు చేరుకొని లోపలికి వెళ్లేందుకు యత్నించారు. గురుకులంపై రాళ్లతో దాడి చేశారు. ఆగ్రహంతో పాఠశాల గేటును ధ్వంసం చేశారు. పోలీసులు అడ్డుకునేందుకు ప్రయత్నించినా వినిపించుకోలేదు. మహిళ హెడ్‌కానిస్టేబుల్ మహిబూబున్నిసా, పలువురు పోలీసులకు రాళ్ల దెబ్బలు తగిలాయి. పాఠశాల గేటు ముందు బైఠాయించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో అక్కడికి చేరుకున్న డీఎస్పీ బాలజీ వారికి నచ్చజెప్పారు. డీఎస్పీ సిబ్బంది, విద్యార్థులకు ధైర్యం కల్పించి గురుకులం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

15 మందిపై కేసులు నమోదు

సిర్గాపూర్ ఎస్టీ బాలికల గురుకుల పాఠశాల వద్ద జరిగిన దాడి, విధ్వంసంపై 15 మందికి పైగా వ్యక్తులను గుర్తించి కేసులు నమోదు చేశామని డీఎస్పీ బాలజీ తెలిపారు. రెండు వాహనాలు సీజ్ చేసినట్లు చెప్పారు. ఇలాంటి ఘటనలకు పాల్పడితే ఎంతటివారైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట కంగ్టీ సీఐ రాజశేఖర్, డివిజన్ పరిధిలోని ఎస్ఐలు వెంకట్‌రెడ్డి, ప్రశాంత్‌కుమార్, లక్ష్మణ్, నారాయణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కార్యదర్శులు బాధ్యతగా పని చేయాలి

కలెక్టర్ డాక్టర్ శరత్



మాట్లాడుతున్న కలెక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్: పంచాయతీ కార్యదర్శులు బాధ్యతగా పని చేసి గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని కలెక్టర్ డాక్టర్ శరత్ అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం గ్రామాల అభివృద్ధిపై నిర్వహించిన సమావేశంలో సంబంధిత శాఖ అధికారులు దిశా నిర్దేశం చేశారు. ఉపాధి హామీ పథకంలో 50 శాతం లేబర్ మొబిలైజేషన్ కావాలన్నారు. చేసిన పనిని ప్రాపర్‌గా రికార్డు చేయాలన్నారు. అప్పుడే కూలీలకు సరైన కూలీ వస్తుందన్నారు. శ్రమ శక్తి సంఘాలతో చర్చించి, టెక్నికల్ అసిస్టెంట్‌లతో అంచనా చేయించి ప్రతిపాదనలు పంపితే పనులు మంజూరవుతాయని తెలిపారు. గ్రామాల్లో ట్యాంకర్, ట్రాలీ ఆదాయ వనరులుగా మారాలన్నారు. ప్రతి శుక్రవారం మొక్కలకు నీరు పట్టాలని ఆదేశించారు. వైకుంఠధామాలు, డంపింగ్ యార్డులు, తెలంగాణ క్రీడా ప్రాంగణాల చుట్టూ బయోఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లా పంచాయతీ అధికారి సురేశ్‌మోహన్, డీఆర్డీఓ శ్రీనివాస రావు, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, అదనపు పీడీలు, డీఎల్‌పీఓలు, నారాయణఖేడ్, పటాన్‌చెరు నియోజకవర్గాల ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఏపీఎంలు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను విజయవంతం చేయాలి

జిల్లాలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాలను సమర్థవంతంగా నిర్వర్తించాలని కలెక్టర్ డాక్టర్ శరత్ వైద్య అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వైద్యారోగ్య, పంచాయతీ, మహిళా, శిశు సంక్షేమం, మున్సిపల్ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిరోజు కనీసం 250 మందిని, పట్టణ ప్రాంతంలో 300 మందిని స్క్రీనింగ్ చేయాలని ఆదేశించారు. రీడింగ్ అద్దాలు అవసరమైన వారికి వెంటనే ఇవ్వాలన్నారు. అనీమియా ఉన్న గర్భిణులను గుర్తించాలని, అనీమియాను తగ్గించి సుఖ ప్రసవం జరిగేలా చూడాలని వైద్యాధికారులకు సూచించారు. ఈ సమీక్షలో జిల్లా పంచాయతీ అధికారి సురేశ్‌మోహన్, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి పద్మావతి, మెడికల్ ఆఫీసర్, ప్రోగ్రాం ఆఫీసర్లు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు, తదితరులు పాల్గొన్నారు.

ఎగుమతులు రూ. 16 వేల కోట్లు

- హైదరాబాద్‌తో పోటీ పడుతున్న సంగారెడ్డి
- రాష్ట్రంలో మూడో స్థానం.. ఐదో స్థానంలో మెదక్ జిల్లా
- విదేశాలకు ఫార్మా, ఆర్గానిక్ కెమికల్ ఉత్పత్తులు
- సామాజిక ఆర్థిక సర్వే నివేదికలో వెల్లడి



గడ్డపోతారంలోని పరిశ్రమలు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: విదేశాలకు వస్తు, సేవల ఎగుమతుల్లో సంగారెడ్డి జిల్లా రాష్ట్రంలో ముందంజలో నిలుస్తోంది. హైదరాబాద్ తర్వాత అత్యధికంగా వస్తుసేవలను ఎగుమతులు చేస్తున్న జిల్లాల్లో సంగారెడ్డి ఒకటిగా ఉంది. ఎగుమతుల ద్వారానే దేశానికి విదేశీ మారకద్రవ్యం వస్తుంది. ఎంత ఎక్కువ ఎగుమతులు పెరిగితే అంత విదేశీ మారక ద్రవ్య నిల్వలు పెరుగుతాయి. తద్వారా దేశ కరెన్సీ విలువ పెరుగుతుంది.

- కేంద్ర ప్రభుత్వ సంస్థ నీతి అయోగ్ విడుదల చేసిన నివేదికల ప్రకారం విదేశాలకు వస్తు, సేవలను ఎగుమతి చేస్తున్న జిల్లాల్లో సంగారెడ్డి మూడో స్థానంలో ఉంది. మొదటి స్థానంలో మేడ్చల్ మల్కాజ్‌గిరి ఉండగా, రెండో స్థానంలో హైదరాబాద్ ఉంది. దాదాపు హైదరాబాద్ సరిసమానంగా సంగారెడ్డి జిల్లా నుంచి ఎగుమతులు ఉండటం గమనార్హం. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశ పెట్టిన సందర్భంగా సామాజిక ఆర్థిక సర్వే నివేదికలో ఈ అంశాలను పొందుపరిచింది.

19.53 శాతం ఎగుమతులు

నీతిఅయోగ్ విడుదల చేసిన నివేదికల ప్రకారం 2021 – 22 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ రాష్ట్రం ఎగుమతుల విలువ రూ.2.65 లక్షల కోట్లు. ఇందులో 69.13 శాతం సర్వీస్ సెక్టార్ కాగా, మిగిలిన 30.87 శాతం సరుకుల వాటా ఉంటుంది. తెలంగాణ నుంచి ఎగుమతులు రూ.81,971 కోట్లు ఉంటాయని గణాంకాలు చెబుతున్నాయి. ఇందులో ఒక్క సంగారెడ్డి జిల్లాలో ఉత్పత్తి అయిన సరుకుల ఎగుమతుల 19.53 శాతం ఉంది. అంటే ఈ లెక్కన రూ.16,300 కోట్ల సరుకులు ఒక్క సంగారెడ్డి జిల్లా నుంచే ఎగుమతులు జరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈ ఎగుమతుల్లో హైదరాబాద్ జిల్లా వాటా కూడా దాదాపు 19.89 శాతం ఉంది. రంగారెడ్డి జిల్లా 16.57 శాతం ఎగుమతుల వాటాతో నాలుగో స్థానంలో ఉండగా, మెదక్ జిల్లా 3.6 శాతంతో ఐదో స్థానంలో ఉంది. అంటే మెదక్ జిల్లా నుంచి సుమారు రూ.2,950 కోట్లు విలువ చేసే సరుకులు విదేశాలకు ఎగుమతి అయినట్లు గణాంకాలు చెబుతున్నాయి.

ఫార్మా, ఆర్గానిక్ కెమికల్‌దే అగ్రస్థానం

- దేశం నుంచి విదేశాలకు ఎగుమతి అవుతున్న సరుకుల్లో సరుకుల్లో ఫార్మాసుటికల్‌దే అగ్రస్థానం. మొత్తం ఎగుమతుల్లో 33.9 శాతం ఈ ఫార్మా ఉత్పత్తులదే. అయితే ఈ ఫార్మ పరిశ్రమలు జిల్లాలో అత్యధికంగా ఉన్నాయి. అలాగే ఆర్గానిక్ కెమికల్స్ ఎగుమతుల్లో రెండో స్థానంలో ఉంది. 23.41 శాతం ఆర్గానిక్ కెమికల్ ఎగుమతి అవుతున్నాయి.
- జిల్లాలో ఫార్మా, కెమికల్ పరిశ్రమలు సుమారు 1500 వరకు ఉంటాయని అంచనా. దేశంలోని ప్రముఖ ఫార్మ కంపెనీల యూనిట్లు సంగారెడ్డి జిల్లాలో ఉన్నాయి. దీంతో జిల్లాలో ఉత్పత్తి అయిన సరుకులు ఎక్కువగా ఎగుమతి అవుతున్నాయి.
- జిల్లాలో ఉత్పత్తి అవుతున్న ఫార్మా, అర్గానిక్ కెమికల్ ఉత్పత్తులు ఎక్కువగా అమెరికాకు ఎగుమతి అవుతున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. మొత్తం ఎగుమతుల్లో 28.13 శాతం అమెరికాకే వెళ్తున్నాయి. తర్వాత చైనాకు 7.3 శాతం, బంగ్లాదేశ్‌కు 3.64 శాతం, రష్యాకు 2.66 శాతం, ఇంగ్లాడ్‌కు 2.05 శాతం ఎగుమతులు అవుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

క్లుప్తంగా

ఎంపీడీఓగా ట్రైనీ కలెక్టర్



బాధ్యతలు తీసుకుంటున్న ఫైజా అహ్మద్

నంగునూరు(సిద్దిపేట): నంగునూరు ఎంపీడీఓగా ట్రైనీ కలెక్టర్ ఫైజా అహ్మద్ ఐఏఎస్ శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. మండల అభివృద్ధి అధికారి విధులు, బాధ్యతలు, పరిపాలన, ప్రజాసంబంధాలపై 15 రోజుల పాటు శిక్షణలో భాగంగా పనిచేస్తారు. ఎంపీపీ జాప అరుణాదేవి, ఏఎంసీ చైర్మన్ రాగుల సారయ్య, మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీఓ వేణుగోపాల్, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది ఆయనను సత్కరించి అభినందనలు తెలిపారు.

కుక్కదాడిలో నలుగురికి గాయాలు



తీవ్రంగా గాయపడిన సుకుమార్

పాపన్నపేట(మెదక్): వీధి కుక్క దాడిలో పలువురు గాయపడ్డారు. మండల పరిధిలోని ముద్దాపూర్‌లో శుక్రవారం వీధి కుక్క దాడి చేయడంతో నలుగురికి గాయాలయ్యాయి. దాడిలో చిన్నారి సుకుమార్ కంటికి తీవ్ర గాయమైంది. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. అలాగే నారాయణ, శివ్వమ్మ, బాబాకు గాయాలయ్యాయి.

యువకుడి అదృశ్యం



ఉపేందర్ (ఫైల్)

సంగారెడ్డిటౌన్: పనికి వెళ్లిన యువకుడు కనిపించకుండా పోయిన సంఘటన శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డి మండలంలోని కొట్లపూర్ గ్రామానికి చెందిన పి.ఉపేందర్ (30) పని మీద సంగారెడ్డి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో తల్లి అంజమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు సంగారెడ్డి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆచూకీ తెలిసిన వారు 87126 56719, 87126 56746 నంబర్లకు సమాచారం తెలపాలన్నారు.

కార్పొరేట్ స్థాయిలో కంటి పరీక్షలు

డీఎంహెచ్ఓ డాక్టర్ కాశీనాథ్

సిద్దిపేటకమాన్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం జిల్లాలో కార్పొరేట్ స్థాయిలో కంటి పరీక్షల నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ కాశీనాథ్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు నేతృత్వంలో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన కంటి వెలుగు కార్యక్రమం జిల్లాలో విజయవంతంగా కొనసాగుతోందన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 70 గ్రామ పంచాయతీలు పూర్తికాగా 35 పంచాయితీల్లో 10 వార్డుల్లో కంటి వెలుగు కార్యక్రమం కొనసాగుతోందన్నారు. ఇప్పటి వరకు పరీక్షించిన వారిలో 25 వేల మందికి కంటి అద్దాల పంపిణీ చేశామన్నారు. అంధత్వ రహిత తెలంగాణ రాష్ట్రం కావడమే సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మంత్రి ఓఎస్‌డీ బాల్‌రాజు, వైద్యారోగ్యశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

లవర్స్ డే వద్దు.. కౌ హగ్ డే ముద్దు

- విదేశాల్లో పెరుగుతున్న కౌ హగ్
- కౌ హగ్‌తో మానసిక ఒత్తిడి మాయం
- టీటీడీ బోర్డు మెంబర్ మొరంశెట్టి రాములు



మాట్లాడుతున్న టీటీడీ బోర్డు మెంబర్ మొరంశెట్టి రాములు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సంప్రదాయాలకు నెలవైన భారత దేశంలో లవర్స్ డే (ప్రేమికుల దినోత్సవం) జరుపుకోవడం సరికాదని, ఆ రోజున కౌ హగ్ డే (గోమాతను కౌగిలించుకోవడం) నిర్వహించుకుందామని తిరుమల తిరుపతి దేవస్థాన బోర్డు సభ్యులు మొరంశెట్టి రాములు పిలుపు ఇచ్చారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని సిద్ధ రామేశ్వర గోశాలలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విదేశీ మోజును విడనాడాలని, మన దేశ సంప్రదాయాలను, సంస్కృతిని గౌరవించాలన్నారు. ప్రపంచంలోని ప్రతీ సమస్యకు పరిష్కారం కేవలం భారతదేశంలో మాత్రమే లభిస్తుందన్నారు. లవర్స్ డే పేరిట యువత చెడు దారిలో పయనించవద్దాన్నారు. గోమాత ఆశీర్వాదం తీసుకుంటే వారందరి ఆశీర్వాదం తీసుకున్నట్లేనన్నారు. ఫిబ్రవరి 14వ తేదీన ప్రేమికుల రోజుకు బదులుగా కౌ హగ్ డే నిర్వహించాలన్న కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనను స్వాగతిస్తున్నామన్నారు. ఫిబ్రవరి 14న గో ప్రేమికులందరూ దగ్గరిలోని గోశాలలో ఆవు(గోమాత)ను ఆలింగనం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అమెరికా, ఆస్ట్రేలియ, బ్రిటన్ తదితర దేశాల్లో కౌ హగ్ (ఆవుల ఆలింగనం) పెరుగుతుందన్నారు. పట్టణంలోని 18 వ వార్డులో గల గోశాలలో ఫిబ్రవరి 14న ప్రజల సందర్శనార్థం 14 గోవులను అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం



పోటీలను ప్రారంభిస్తున్న వేణుగోపాల్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, కేసీఆర్ ట్రోఫీ ఆర్గనైజర్ మచ్చ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని దుద్దెడలో ఆదర్శ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణాలకు దీటుగా పల్లెల్లో క్రీడల కోసం ప్రభుత్వం మైదానాలు ఏర్పాటు చేసి, అన్ని వసతులు కల్పిస్తోందని అన్నారు. గ్రామీణ క్రీడాకారులు దీనిని సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా రాణించాలని కోరారు. టోర్నమెంట్‌లో విజేత జట్టును జయశంకర్ స్టేడియంలో ఫ్రెండ్లీ కప్‌లో ఆడేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆరెపల్లి మహాదేవ్‌గౌడ్, ఆదర్శ ఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నూనె కుమార్, ఉపాధ్యక్షుడు పంజాల శ్రీనివాస్, చైతన్య యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, సభ్యులు మిద్దె శివకుమార్, ఎండీ మొహినొద్దిన్, మిద్దె రమేష్, భాకి ప్రభాకర్, పంజాల శ్రీనివాస్, మంతూరి నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



కాలిపోయిన సామగ్రి

పాపన్నపేట (మెదక్): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో నాగ్‌సాన్‌పల్లిలో శుక్రవారం పెంకుటిల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన ఎల్లపురం ఆశయ్య ఇంట్లో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. చుట్టు పక్కల వారు వచ్చి మంటలార్పారు. ప్రమాదంలో ఫ్రిజ్, వంట సామగ్రి, దుస్తులు కాలిపోయాయి. వీటి విలువ సుమారు రూ.3లక్షలు ఉంటుందని బాధితులు తెలిపారు.

మట్టి టిప్పర్ల పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న మట్టి టిప్పర్లు

శివ్వంపేట(నర్సాపూర్): ప్రభుత్వ అనుమతులు లేకుండా మట్టిని అక్రమంగా టిప్పర్లలో తరలిస్తున్నారు. వాటిని గురువారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధి సికింద్లాపూర్ శివారు నుంచి మట్టి వ్యాపారులు ప్రభుత్వ అనుమతులు లేకుండా రాత్రి వేళల్లో మట్టిని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మూడు టిప్పర్లను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ రవికాంత్‌రావు తెలిపారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా మట్టిని తరలించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యుత్ కోతలపై రైతుల ఆగ్రహం



నంగునూరులో రాస్తారోకో చేస్తున్న రైతులు

నంగునూరు(సిద్దిపేట): విద్యుత్ కోతలపై రైతులు మండిపడుతున్నారు. ఐదు రోజులుగా కరంట్ సరఫరాలో కోతలు విధించడంతో పంటలు ఎండిపోవడంతోపాటు మూగజీవాల తాగునీటికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఆరోపిస్తూ శుక్రవారం నంగునూరులో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడారు. ఎప్పుడు కరెంట్ వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియడంలేదని, అధికారులను అడిగినా సరైన సమాధానం చెప్పడం లేదన్నారు. ప్రభుత్వం 24 గంట పాటు వ్యవసాయానికి కరెంట్ సరఫరా చేస్తోందని మంత్రులు అసెంబ్లీలో ప్రకటించినా కనీసం పది గంటలు కూడా ఇవ్వడంలేదన్నారు. దీంతో పనులు మానుకొని బావుల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల రాస్తారోకోకు కాంగ్రెస్, బీజేపీ నాయకులు సంఘీబావం తెలిపారు. విషయం తెలుసుకున్న రాజగోపాల్‌పేట ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడారు. రాస్తారోకో చేసి ప్రజలను ఇబ్బందులు పెట్టకుండా సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. అధికారులు స్పందింక పోవడంతోనే రోడ్డు ఎక్కామని విద్యుత్ అధికారులు వచ్చి సమాధానం ఇస్తేనే ఆందోళన విరమిస్తామని చెప్పారు. విద్యుత్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడిన ఎస్‌ఐ సమస్యల పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని చెప్పడంతో ఆందోళన విరమించారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి

చిన్నకోడూరు(సిద్దిపేట): విద్యుదాఘాతంతో కార్మికుడు మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని చర్లఅంకిరెడ్డిపల్లి శివారులో గురువారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా అల్లవరం మండలం గుడాల ములపర్తిపేటకు చెందిన కాత్రు లక్ష్మణ్(40) వృత్తి రీత్యా ఎలక్ట్రీషియన్. చర్లఅంకిరెడ్డిపల్లి శివారు ప్రభుత్వ గిడ్డంగుల్లో ఏడాదిగా పనిచేస్తున్నాడు. గురువారం సాయంత్రం పని చేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. గమనించిన తోటి కార్మికులు వెంటనే సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడి సోదరుడు నాగేశ్వర్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు శుక్రవారం జరిమానా విధించింది. సిద్దిపేటలోని నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీఓ కార్యాలయ చౌరస్తా, రాజీవ్ రహదారిపై సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తమ సిబ్బందితో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో 16 మంది పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా విచారణ చేసిన న్యాయమూర్తి రమేశ్‌బాబు రూ.36 వేల జరిమానా విధించారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

డీఈఓ శ్రీనివాస్ రెడ్డి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ

చిన్నకోడూరు(సిద్దిపేట): క్రమశిక్షణ, పట్టుదలతో చదివి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఈఓ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రామునిపట్ల, ఇబ్రహీంనగర్, మేడిపల్లి, అనంతసాగర్, చర్ల అంకిరెడ్డిపల్లి గ్రామాల్లోని ఉన్నత పాఠశాలలను సందర్శించారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు తీరును పరిశీలించారు. విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వంద శాతం ఫలితాలు సాధించిన పాఠశాలకు మంత్రి హరీశ్‌రావు రూ. 25 వేలు, 10 గ్రేడ్ సాధించిన విద్యార్థులకు రూ. 10 వేలు అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, సీఆర్‌పీ తిరుపతి పాల్గొన్నారు.

తల్లిని చంపిన తనయుడికి..

జీవిత ఖైదు, జరిమానా



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని

మెదక్ మున్సిపాలిటీ: తల్లిని చంపిన తనయుడికి జీవిత ఖైదుతోపాటు జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి లక్ష్మీశారద శుక్రవారం తీర్పునిచ్చినట్లు ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని తెలిపారు. మెదక్‌లోని జిల్లా పోలీసు కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. నిజాంపేట పోలీస్ స్టేషన్ పరిధి నార్లాపూర్ గ్రామానికి చెందిన మిరుదొడ్డి పోషవ్వ, భూమయ్య దంపతులకు ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు. రెండేళ్ల క్రితం భూమయ్య అనారోగ్యంతో చనిపోయాడు. పెద్ద కొడుకు నర్సింలు భార్యా పిల్లలతో కలిసి బతుకుదెరువు కోసం హైదరాబాద్ వెళ్లాడు. అక్కడ నల్లకుంటలో వుంటూ మేస్త్రీ పని చేసుకుంటున్నాడు . రెండో కొడుకు మిరుదొడ్డి కుమార్ మద్యానికి బానిసయ్యాడు. అతడి పెట్టే బాధలు తట్టుకోలేక భార్య మంజుల తన పిల్లలను తీసుకొని వెళ్లిపోయింది. దీంతో నార్లాపూర్‌లో తల్లి పోషవ్వతో కలిసి ఉంటున్నాడు. ఈ క్రమంలో కుమార్ మద్యం తాగొచ్చి తల్లిని కొడుతుండేవాడు. బైక్ కొనేందుకుతల్లిని డబ్బులు అడుగగా ఆమె ఇవ్వలేదు. దీంతో తల్లి చెవి కమ్మలకోసం 2022 మార్చి 21వ తేదీ రాత్రి గొంతు నులిపి చంపేశాడు. అనంతరం ఏమీ తెలియన్నట్లుగా బంధువులు, హైదరాబాద్‌లో ఉన్న అన్న నర్సింలుకు తల్లి మరణవార్త తెలిపాడు. అంత్యక్రియల గురించి ఏర్పాటు చేస్తుండగా పోషవ్వ చెవి కమ్మలు కనిపించలేదు. అలాగే ఆమె మెడ భాగం కొద్దిగా ఉబ్బి ఉండటం, కుమార్ ప్రవర్తన అనుమానాస్పందంగా కనిపించంది. అన్న నర్సింలు బంధువులు, గ్రామస్తుల సమక్షంలో కుమార్‌ను నిలదీశాడు. మోటార్ సైకిల్ కొనడానికి డబ్బులు అడిగితే ఇవ్వక పోవడంతో ఆమెను చంపినట్లు ఒప్పుకున్నాడు. అతడిపై రామాయంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా శుక్రవారం మెదక్ జిల్లా కోర్టులో కేసు విచారణకు వచ్చింది. పూర్తి ఆధారాలను పరిశీలించిన జిల్లా జడ్జి నిందితుడు మిరుదొడ్డి కుమార్‌కు జీవిత ఖైదు, రూ.15 వేల జరిమానా విధించారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన సిబ్బందిని ఎస్పీ అభినందించారు.



భవన్స్ వివేకానంద డిగ్రీ కళాశాల జట్టు



గౌతమ్ జూనియర్ కాలేజ్ ఈసీఐఎల్ జట్టు

సందడిగా 'సాక్షి' ప్రీమియర్ లీగ్

- జూనియర్ విభాగంలో విజేతగా గౌతమ్ జూనియర్ కాలేజ్
- సీనియర్స్ విభాగంలో విజేతగా భవన్స్ వివేకానంద డిగ్రీ కాలేజ్
- 17 రీజినల్ ఫైనల్స్

పోచారం: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా, ప్రతాపసింగారంలోని బాబూరావు సాగర్ క్రికెట్ మైదానంలో కొనసాగుతున్న 'సాక్షి' ప్రీమియర్ లీగ్–4 మ్యాచ్‌లు శుక్రవారం సెమీ ఫైనల్స్‌తో పాటు ఫైనల్స్ సందడిగా సాగాయి.

విజేతల వివరాలు..

బాబూరావు సాగర్ క్రికెట్ మైదానం – 1

- జూనియర్స్ విభాగం ఫైనల్ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన గౌతమ్ జూనియర్ కాలేజ్ ఈసీఐఎల్ జట్టు 8 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 87 పరుగులు సాధించింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన భవన్స్ శ్రీఅరవిందో జూనియర్ కాలేజ్ జట్టు 8 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 79 రన్స్ తీసి ఓటమి పాలైంది. దీంతో హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్ జిల్లాల స్థాయి జూనియర్ విభాగంలో గౌతమ్ జూనియర్ కాలేజ్ జట్టు విజేతగా నిలిచింది.
- సీనియర్ విభాగంలో మొదటి సెమీ ఫైనల్స్‌లో వేద డిగ్రీ కాలేజ్ జట్టు 10 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 86 రన్స్ చేసింది. తర్వాత బ్యాటింగ్ చేసిన ఎమ్ఎల్ఆర్ఐటీ దుండిగల్ జట్టు 10 ఓవర్లలో 7 వికెట్ల కోల్పోయి 82 రన్స్ మాత్రమే చేయడంతో వేద డిగ్రీ కాలేజ్ విజయం సాధించింది.

బాబూరావు సాగర్ క్రికెట్ మైదానం – 2

- సీనియర్స్ విభాగం రెండో సెమీ ఫైనల్స్‌లో ఎస్‌పీ కాలేజ్ జట్టు 10 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 116 పరుగులు తీసింది. ఈ జట్టుతో తలపడిన భవన్స్ వివేకానంద డిగ్రీ కళాశాల జట్టు 9.4 ఓవర్లలో 2 వికెట్ల కోల్పోయి 117 పరుగులు తీసి విజయం చేజిక్కించుకుంది. ఈ సెమీ ఫైనల్స్‌లో భవన్స్ జట్టు నుంచి జగదీష్ 27 బంతుల్లో 66 పరుగులు చేశాడు. మరో క్రీడాకారుడు క్రిస్టిక్ 26 బంతుల్లో 49 రన్స్ చేశాడు.
- సీనియర్స్ విభాగం ఫైనల్స్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన వేద డిగ్రీ కళాశాల జట్టు 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 72 రన్స్ చేసింది. వీరితో బ్యాటింగ్ చేసిన భవన్స్ వివేకానంద డిగ్రీ కాలేజ్ జట్టు 1 వికెట్ కోల్పోయి 73 పరుగులు చేసి విజయకేతనం ఎగురవేసింది. భవన్స్ జట్టు సభ్యుడు నితీష్ 8 బాల్స్‌లో 27 రన్స్ తీసి ప్రతిభ చాటాడు. జగదీష్ 15 బంతుల్లో 22 రన్స్ సాధించాడు. సీనియర్ విభాగంలో హైదరాబాద్ జిల్లా విజేతగా భవన్స్ వివేకానంద డిగ్రీ కళాశాల సైనిక్పురి నిలిచింది.
- ఈ నెల 17న ఇదే మైదానంలో రీజినల్ ఫైనల్స్ నిర్వహించనున్నారు.

కల్యాణం.. కమనీయం

ఘనంగా భ్రమరాంబ సహిత రామలింగేశ్వర స్వామి కల్యాణం



స్వామి వారికి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మద్దూరు(హుస్నాబాద్): దూల్మిట్ట మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బెక్కల్ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ భ్రమరాంబ సహిత రామలింగేశ్వర స్వామి కల్యాణం శుభకృత నామ సంవత్సరం మాఘబహుళ పంచమి రోజున ఆలయ అర్చకుడు శివకుమార్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కల్యాణోత్సవానికి గ్రామం తరఫున ఆలయ చైర్మన్ లింగారెడ్డి దంపతులు, సర్పంచ్ బాలరాజు దంపతులు పట్టువస్త్రాలు, తలంబ్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా స్వామివారి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఆలయ పరిసర ప్రాంతాల్లో ఊరేగించారు. స్వామివారి కల్యాణోత్సవానికి మండలంలోని గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున్న తరలివచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాములు, అర్చకుడు భద్రప్ప, భక్తులు పాల్గొన్నారు.

డీసీఎం ఢీ: యువకుడి మృతి



శ్రీకాంత్ మృతదేహం

చిన్నశంకరంపేట(మెదక్): డీసీఎం ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన శుక్రవారం చిన్నశంకరంపేట మండల కేంద్రంలో చోటుచేసుకుంది. చిన్నశంకరంపేట ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని సూరారం గ్రామానికి చెందిన రానబోయిన శ్రీకాంత్(28) బైక్‌పై చిన్నశంకరంపేట వస్తున్నాడు. ఈ క్రమంలో ఆకులవారి కుంట వద్ద ఎదురుగా వచ్చిన డీసీఎం ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య జ్యోతి, కూతురు, తల్లిదండ్రులు యాదగిరి, నర్సవ్వ ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసునమోదు చేసి పంచనామా నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు చిన్నశంకరంపేట ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాద కేసులు తగ్గించాలి

సిద్దిపేట పోలీసు కమిషనర్ ఎన్.శ్వేత



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ శ్వేత

సిద్దిపేటకమాన్: జిల్లాలో రోడ్డు ప్రమాద కేసులను తగ్గించాలని సిద్దిపేట పోలీసు కమిషనర్ ఎన్.శ్వేత అన్నారు. పోలీసు కమిషనర్ కార్యాలయంలో శుక్రవారం గజ్వేల్ డివిజన్ పోలీసు అధికారులతో పెండింగ్ కేసులపై సీపీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ గ్రామాల నుండి రాజీవ్ రహదారి కలిసే ప్రదేశంలో స్పీడ్ బ్రేకర్స్, జీబ్రా క్రాసింగ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్డు నియమాలు పాటించే విధంగా ప్రజలకు అవగహన కల్పించాలన్నారు. గంజాయి, పేకాట స్థావరాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్, గజ్వేల్ ఏసీపీ రమేశ్, సిద్దిపేట ఏసీపీ దేవారెడ్డి, వన్‌టౌన్ సీఐ భిక్షపతి, త్రీటౌన్ సీఐ భానుప్రకాష్, టూటౌన్ సీఐ రవికుమార్, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ హత్యకేసులో నిందితుడి అరెస్ట్



నిందితుడితో పోలీసులు



నిందితుడి వాహనంపై వెళ్తున్న రుక్కమ్మ

జహీరాబాద్: జహీరాబాద్ సమీపంలో గురువారం అనుమానాస్పద స్థితిలో మరణించిన మహిళను మునిపల్లి మండలంలోని అంతారం గ్రామానికి చెందిన పిచ్చకుంట్ల రుక్కమ్మ(50)గా గుర్తించారు. శుక్రవారం ఇందుకు సంబంధించిన వివరాలను సీఐ భూపతి విలేకరుల సమావేశంలో వెల్లడించారు. రుక్కమ్మ రంజోల్ గ్రామంలో నివాసం ఉంటూ అడ్డా కూలీగా పని చేస్తోంది. భర్త చనిపోవడంతో ఒంటరిగా ఉంటోంది. గురువారం జహీరాబాద్ పట్టణంలోని భరత్‌నగర్‌కు చెందిన ఖదీర్ టైల్స్ పరిచేందుకు రంజోల్ గ్రామానికి వెళ్లాడు. సామగ్రి లేకపోవడంతో పని లేదని చెప్పారు. దీంతో తిరుగు ప్రయాణమయ్యాడు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఘర్ దాబా వద్ద లేబర్ అడ్డా వద్ద కూలీ పని కోసం నిలుచున్న రుక్కమ్మ కనిపించింది. పని దొరకలేదని, ఇంటికి వెళ్లిపోతున్నట్లు చెప్పింది. ఖదీర్ కూడా తనకు పని దొరకలేదని పార్టీ చేసుందామని చెప్పడంతో ఇందుకు రుక్కమ్మ సమ్మతించడంతో టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై ఇద్దరు బయలు దేరారు. మార్గం మధ్యంలో పస్తాపూర్ క్రాస్‌రోడ్డు వద్ద మద్యం, బిర్యాని కొనుగోలు చేశాడు. అక్కడి నుంచి అల్గోల్ శివారులో ఉన్న ఫారెస్టులోకి వెళ్లారు. మద్యం తాగారు. అనంతరం డబ్బుల విషయంలో రుక్కమ్మ, ఖదీర్ మధ్య గొడవ జరిగింది. ఆగ్రహంతో రుక్కమ్మను హత్య చేశాడు. అనంతరం కందకంలోకి తోశాడు. సత్వార్ మీదుగా బీదర్ పారిపోతుండగా పాత చెక్‌పోస్టు వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి నిందితురాలి సెల్‌ఫోన్, ఖదీర్ సెల్‌ఫోన్, టీవీఎస్ ఎక్సెల్ వాహనం స్వాధీనం చేసుకున్నారు.